www.prajaswaramdaily.com

# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 319 | పేజీలు : 5 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | సోమవారం 29-07-2024

MHR TV
www. mhrtv.com

# టార్గెట్..గ్రేటర్

- బడ్జెట్‌లో వరాల జల్లు కురిపించిన సీఎం రేవంత్
- హైదరాబాద్ అభివృద్ధికి రూ. 10 వేల కోట్లు
- వివిధ విభాగాలకు భారీగా కేటాయింపులు
- నగరవాసుల సంక్షేమం, రక్షణకు పెద్దపీట
- ప్రతిష్టాత్మక ప్రాజెక్టులుగా మూసీ సుందరీకరణ, మెట్రో రెండో దశ, హైడ్రా
- మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాలు దక్కించుకునేలా వ్యూహం
- హస్తం గూటికి చేరేందుకు మరికొం తమంది గ్రేటర్ ఎమ్మెల్యేల మంతనాలు
- రాజధానిని హస్తగతం చేసుకోవడమే లక్ష్యంగా అడుగులు



జీహెచ్ఎంసీ ఎన్నికలపై కాంగ్రెస్ గురి

**హైదరాబాద్, జూలై 28, (ప్రజాస్వరం):** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ కి తెరదీసిందా? అన్న ప్రశ్నకు రాష్ట్ర బడ్జెట్ లో చేసిన కేటాయింపులే అవునని సమాధానం చెబుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మహానగరాభివృద్ధికి సర్కారు వరాల జల్లు కురిపించింది. సమైక్య పాలనతో పాటు 2014 తర్వాత ప్రత్యేక పాలనలోనూ ఈ స్థాయిలో నిధులు కేటాయించిన దాఖలాల్లేవు. పైగా గ్రేటర్ ప్రజల జీవితాలను ప్రభావితం చేసే జీహెచ్ఎంసీ, జలమండలి,

**మిగతా 2 లో..**







## ఆందోళనలో ఉద్యోగార్థులు

- పోటీ పరీక్షల వాయిదాలతో అయోమయం
- నోటిఫికేషన్‌లు ఇచ్చినా నిర్వహణపై అనుమానాలు
- ప్రభుత్వాలు మారినా నిరాశే..
- గ్రూప్ 1, రద్దు.. రివైజ్డ్ షెడ్యూల్ ప్రకారం తిరిగి ఎగ్జామ్
- గ్రూప్ 2 డిసెంబర్‌కు వాయిదా
- ఏండ్లుగా ప్రిపేరవుతున్న అభ్యర్థుల్లో అసహనం

| 2

విలేకరులు కావలెను
ప్రజాస్వరం
పదిహేడు సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రజాస్వరం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.
సెల్ : 800 860 9999

హైదరాబాద్ లో ఆషాఢమాసం బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. లాల్ దర్వాజ, భాగ్యలక్ష్మి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారికి ప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అంబర్ పేటలోని మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నగరవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొన్నది.

| 5

– హైదరాబాద్, జూలై 28 ప్రజాస్వరం



# బోనం.. ఘనం

వాడవాడలా పండుగ వాతావరణం

బోనాలు సమర్పించిన భక్తులు

- కొవిడ్ తర్వాత బాధితులు పెరిగినట్లు నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే వెల్లడి
- గ్రామాలతో పోలిస్తే పట్టణాల్లోనే అధికం
- మొదటి స్థానంలో ఢిల్లీ.. తర్వాత తమిళనాడు
- తెలుగు రాష్ట్రాల ప్రజలకూ పొంచి ఉన్న ముప్పు
- మహిళలు అధిక సమస్యలు ఎదుర్కొం టారని వెల్లడి
- బరువును తగ్గించుకో వాలని వైద్యుల సలహా

| 2



# భారీ మూల్యం తప్పదా..?

అన్ని వయస్సుల వారిని వేధిస్తున్న స్థూలకాయం

# సర్ప్ వినాశ్ 2.0

- ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్
- 55 మంది మిలిటెంట్స్‌ను మట్టుబెట్టేందుకు రంగంలోకి భారత ఆర్మీ
- ప్రత్యేక శిక్షణ తీసుకున్న స్పెషల్ ఫోర్స్

- హిట్ లిస్ట్ సిద్ధం చేసిన కేంద్ర ప్రభుత్వం
- 21 ఏండ్లలో సైన్యం చేపట్టిన అతిపెద్ద ఆపరేషన్
- కీలక ప్రాంతాల్లో సైనికుల మోహరింపు
- 2003లో 65 మంది ఉగ్రమూకల హతం

| 2






## ఓరుగల్లులో పార్టీ ఆఫీసుల చిచ్చు

- బీఆర్ఎస్ భవన్ కూల్చివేతకు ప్రభుత్వం నోటీసులు జారీ
- కాంగ్రెస్ ఆఫీసుకూ అనుమతి లేదంటూ ఎదురుదాడి
- ఆ స్థలంలో కామర్షియల్ కాంప్లెక్స్ నడిపిస్తున్నారని ఆరోపణ
- తాజా, మాజీ ఎమ్మెల్యే మధ్య మాటల యుద్ధం

| 2





## బిగ్‌బాస్ సీజన్ 8

నెలరోజుల్లో ప్రారంభమవుతుందని టాక్

ఆతృతగా ఎదురుచూస్తున్న ప్రేక్షకులు

| 2

## జాబిల్లిపై నీటి జాడ

2020లో చైనా 'చాంగ్ 5' ఉపగ్రహ ప్రయోగం

- రెండు కిలోల మట్టి నమూనాలు తీసుకొచ్చిన వ్యోమనౌక
- నీటి అణువులు ఉన్నట్లు గుర్తించిన సీఏఎస్ శాస్త్రవేత్తలు
- సర్వత్రా ఆసక్తి

| 2



# టార్గెట్.. గ్రేటర్



**(మొదటి పేజీ తరువాయి)**

హెచ్ఎండీఏ, హైదరాబాద్ మెట్రో రైలు వంటి ఇతరాత్ర విభాగాలు స్టేట్ బడ్జెట్ పైనే ఆశలు పెట్టుకుని పంపిన ప్రతిపాదనలకు అంతంతమాత్రంగా నిధుల కేటాయింపులు జరిగేవి. కానీ ఈ సారి సిటీలో అభివృద్ధి, మౌలిక వసతుల నిర్వహణలో కీలక పాత్ర పోషించే వివిధ విభాగాలు ఊహించని విధంగా సర్కారు నిధులు కేటాయించింది. జీహెచ్ఎంసీ మొదలుకుని జంట నగరవాసుల దాహార్తిని తీర్చే జలమండలితో పాటు గ్రేటర్ పరిధిలో ఔటర్ బయటనున్న స్థానిక సంస్థల పరిధిలో ఆస్తుల పరిరక్షణ, విపత్తుల నివారణ కోసం ఇటీవలే ఏర్పాటు చేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్, అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కు సైతం రూ. 200 కోట్లను సర్కారు కేటాయించింది. ఆర్థిక సంవత్సరం( 2024-25) కు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం గత గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో మహానగరానికి పెద్ద పీట వేసిందనే చెప్పవచ్చు. సమైక్య, ప్రత్యేక పాలనలోనూ గతంలో ఎన్నడూ లేని విధంగా సర్కారు జీహెచ్ఎంసీకి బడ్జెట్లో తగిన ప్రాధాన్యతనిస్తూ ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న జీహెచ్ఎంసీకి రూ.3065 కోట్ల కేటాయింపులు జరపటంతో బల్దియాకు కాస్త ఊరట లభించింది. వర్తమాన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీహెచ్ఎంసీకి రూ. 5 వేల కోట్లను కేటాయించాలని అధికారులు కోరగా రూ. 3065 కోట్లు కేటాయించటంతో పాటు హైదరాబాద్ మహానగరంలో ప్రత్యేకంగా మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ఏకంగా రూ.10 వేల కోట్లను కూడా కేటాయించటం జీహెచ్ఎంసీ చరిత్రలోనే ఫస్ట్ టైమ్ గా చెప్పుకోవచ్చు. జీహెచ్ఎంసీకి రూ.3065, జలమండలికి రూ.3385 కోట్లు, హెచ్ఎండీఏకు రూ.500 కోట్లు, మెట్రో రైలు విస్తరణ (పాతబస్తీ)కి రూ.500 కోట్లు, ఎయిర్ పోర్టు మెట్రోరైలుకు రూ.100 కోట్లు, హైదరాబాద్ మెట్రోకు రూ. 500 కోట్లు, హైడ్రాకు రూ. 200 కోట్లు, మూసీ సుందరీకరణ కు రూ.1500 కోట్లు, జీహెచ్ఎంసీ పరిధిలో మౌలిక వసతుల మెరుగుకు రూ. 3050 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.200 కోట్లు, ఎంఎంటీఎస్ కు జరిపిన రూ.50 కోట్లతో మొత్తం రూ.20 వేల కోట్లు కేటాయించిందంటే ముమ్ముందు హైదరాబాద్ మహానగరంలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధితో పాటు అత్యాధునిక రవాణా వ్యవస్థ మెట్రోరైలు కూడా కొత్తగా పలు ప్రాంతాలకు అందుబాటులోకి రానుంది. ఈ బడ్జెట్ లో జరిపిన కేటాయింపులతో త్వరలోనే హైడ్రా యాక్షన్ లోకి రావటంతో పాటు మూసీ సుందరీకరణ, నగరంలో మౌలిక వసతులను మెరుగుపరిచే పనులను ప్రారంభించనున్నారు. భాగ్యనగర్ జీవనది అయిన మూసీ ప్రక్షాళన, పరిరక్షణ, సుందరీకరణ కు సంబంధించిన ఆర్థికంగా లైన్ క్లియర్ అయినట్టేనని చెప్పవచ్చు. ఏళ్ల తరబడి కాలుష్య కాసారంగ మారిన మూసీ ప్రక్షాళన, సుందరీకరణతో పాటు ఎకలాజికల్, హెరిటేజ్, మెట్రో, టూరిజం నాలుగు జోన్లుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే కేంద్రాన్ని రూ. 10 వేల కోట్ల అభ్యర్థించినా, ఫలితం దక్కలేదు. కొత్త సర్కారు కొలువుదీరిన నాటి నుంచి మూసీపై ప్రత్యేక చొరవ చూపటంతో పాటు మూసీ సుందరీకరణ కోసం రాష్ట్ర బడ్జెట్ లో రూ.1500 కోట్లను కేటాయించి, సర్కారు చిత్తశుద్ధిని చాటుకుందని చెప్పవచ్చు. మూసీ పరీవాహక ప్రాంతాన్ని పబ్లిక్, ప్రైవేటు పార్టనర్ షిప్ (పీపీపీ) పద్ధతిలో అభివృద్ధి చేయాలని భావిస్తున్న సర్కారు బడ్జెట్ లో కేటాయించిన రూ.1500 కోట్లను స్థల సేకరణ, మూసీలో కాలుష్య నివారణ కోసం వినియోగించనున్నట్లు సమాచారం. 2020 డిసెంబర్ లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగాయి. బీఆర్ఎస్ పార్టీ మెజార్టీ స్థానాలను గెలుచుకుని మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు చేపట్టింది. బీఆర్ఎస్ పార్టీ తరపున బంజారాహిల్స్ డివిజన్ ను గెలుపొంది గద్వాల్ విజయలక్ష్మి మేయర్ గా 2021 ఫిబ్రవరి 11న ఎన్నికయ్యారు. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 11 తో ఆమె తన నాలుగేళ్ల పదవీ కాలం, అలాగే 2026 ఫిబ్రవరి లో కౌన్సిల్ పదవీకాలం ముగియనుంది. హైదరాబాద్ సిటీ అభివృద్ధి కోసం బడ్జెట్లో జరిపిన భారీ కేటాయింపులతో ఎన్నికలొచ్చే లోపు మహానగర ప్రజలకు విజబులిటీగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నది సర్కారు వ్యూహంగా కన్పిస్తుంది.

# బిగ్ బాస్ సీజన్ 8

- ఈ నెల 21న లోగో విడుదల
- ఈ సారి రెండు హౌజ్ లు ఉండొచ్చని టాక్
- మరో నెల రోజుల్లో ప్రారంభమవుతుందని ఊహాగానాలు
- చివరి దశలో కంటెస్టెంట్ ల ఎంపిక
- ఆతృతగా ఎదురుచూస్తున్న ప్రేక్షకులు

**హైదరాబాద్, జూలై 28, (ప్రజాస్వరం):** బిగ్ బాస్ రియాలిటీ షో అత్యంత ఆదరణ కలిగిన టెలివిజన్ ఈవెంట్. ప్రతి ఏడాది మూడు నెలలు ప్రసారమయ్యే ఈ షో కోసం ఆడియన్స్ ఆతృతగా ఎదురు చూస్తారు. షో ప్రారంభం కావడానికి రెండు నెలల ముందే ఆ మూడ్ లోకి వెళ్ళిపోతారు. ఈ సారి వచ్చే కంటెస్టెంట్స్ ఎవరు? షో ఎలా ఉండబోతుంది? హోస్ట్ ఎవరు? ఇలా పలు విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. ఇక లాంచింగ్ ఎపిసోడ్ రోజు ప్రేక్షకుల ఉత్కంఠకు తెర పడుతుంది. సదరు సీజన్లో కంటెస్ట్ చేసే సెలెబ్స్ ఎవరో తేలిపోతుంది. గేమ్ మొదలయ్యాక ఆడియన్స్ వర్గాలుగా విడిపోతారు. వారికి నచ్చిన వారిని ఫాలో కావడం స్టార్ట్ చేస్తారు. గేమ్, ప్రవర్తన నచ్చితే సామాన్యులను కూడా అభిమానిస్తారు. గతంలో ఇది రుజువైంది.

ఒకప్పుడు బిగ్ బాస్ షోని సామాన్య జనాలు ఇష్టపడేవారు కాదు. ఇదేదో సోది షో అనుకునేవారు. మెల్లగా పల్లె జనాలకు కూడా బిగ్ బాస్ షో ఎక్కింది. వారు అందులోని మజాను ఆస్వాదిస్తున్నారు.బిగ్ బాస్ సీజన్ 7 గ్రాండ్ సక్సెస్ అయ్యింది. భారీ టీఆర్పీ రాబట్టింది. రైతుబిడ్డ ట్యాగ్ తో హౌస్లో అడుగుపెట్టిన పల్లవి ప్రశాంత్ విన్నర్ అయ్యాడు. ఇది ఎవరూ ఊహించని పరిణామం. శివాజీ టైటిల్ ఫేవరేట్ గా ప్రారంభం నుంచి ప్రచారం అయ్యాడు. అయితే చివరి వారాల్లో శివాజీ గ్రాఫ్ పడిపోయింది. పల్లవి ప్రశాంత్ గ్రాఫ్ పెరిగింది. ఇక అమర్ దీప్ రన్నర్ పొజిషన్ తో సరిపెట్టుకున్నాడు. టైటిల్ గెలిచిన పల్లవి ప్రశాంత్ అల్లర్ల కేసులో అరెస్ట్ కావడం అపశృతి అని చెప్పొచ్చు. గత సీజన్ గ్రాండ్ సక్సెస్ కావడంతో బిగ్ బాస్ మేకర్స్ సీజన్ 8 సరికొత్తగా సిద్ధం చేస్తున్నారు. బిగ్ బాస్ తెలుగు 8 లోగో జులై 21న విడుదల చేశారు. లోగోలో అనేక కోడ్స్ చోటు చేసుకున్నాయి. వాటిని క్రాక్ చేస్తే సీజన్ 8 ఎలా ఉంటుందో ఒక అవగాహన వస్తుంది. ఈసారి రెండు హౌస్లు ఉంటాయనే ప్రచారం జరుగుతుంది. విన్నర్ ని డిసైడ్ చేసే పద్ధతిగా కూడా విభిన్నంగా ఉంటుందట.నెలరోజుల్లోపే బిగ్ బాస్ సీజన్ 8 ప్రారంభం కానుందని సమాచారం. లోగో తో కూడిన ప్రోమో వదలిన బిగ్ బాస్ మేకర్స్ తేదీ పై స్పష్టత ఇవ్వలేదు. బిగ్ బాస్ హౌస్ నిర్మాణం కూడా పూర్తి అయ్యిందని తెలుస్తుంది. ముఖ్యమైన కంటెస్టెంట్స్ ఎంపిక ప్రక్రియ చివరికి చేరుకుందట. ప్రతిసారి అధికారిక ప్రకటనకు ముందే కొందరు సెలెబ్స్ పేర్లు లీక్ అవుతాయి. ఈసారి లిస్ట్ భారీగానే ఉంది. యూట్యూబర్ బంచిక్ బబ్లు, బర్రెలక్క, కుమారీ ఆంటీ, సోనియా సింగ్, అమృత ప్రణయ్, అంబటి రాయుడు, సురేఖావాణి, నటి హేమ, వేణు స్వామి, రీతూ చౌదరి, విష్ణు ప్రియ, కిరాక్ ఆర్పీ, బుల్లెట్ భాస్కర్ కంటెస్టెంట్స్ గా ఎంపికయ్యారని అంటున్నారు. తాజాగా ఓ సెన్సేషనల్ నేమ్ తెరపైకి వచ్చింది. సీనియర్ హీరో వినోద్ కుమార్ బిగ్ బాస్ తెలుగు 8లో కంటెస్ట్ చేస్తున్నాడట. 80లలో హీరోగా ఎంట్రీ ఇచ్చిన వినోద్ కుమార్ కన్నడ, తెలుగు భాషల్లో రాణించారు. మామగారు, సీతారత్నం గారి అబ్బాయి, కర్తవ్యం చిత్రాలు ఆయనకు ఇమేజ్ తెచ్చిపెట్టాయి. హీరోగా ఫేడ్ అవుట్ అయ్యాక క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా మారారు. ఇటీవల రాజధాని ఫైల్స్ టైటిల్ తో ఒక చిత్రం చేశాడు. వినోద్ కుమార్ కెరీర్ ఏమంత ఆశాజనకంగా లేదు. ఈ క్రమంలో బిగ్ బాస్ షోకి వెళ్లడం వలన మేలు జరుగుతుందని భావిస్తున్నాడట. ఆయన పచ్చ జెండా ఊపాడంటూ ప్రచారం జరుగుతుంది.

# ఆపరేషన్ సర్ప్ వినాశ్ 2.0

- ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యం
- 55 మంది మిలిటెంట్స్‌ను మట్టుబెట్టేందుకు రంగంలోకి భారత ఆర్మీ
- స్పెషల్ ఫోర్స్‌కు ప్రత్యేక శిక్షణ
- హిట్ లిస్ట్ జాబితా సిద్ధం చేసిచ్చిన కేంద్ర ప్రభుత్వం
- 21 ఏండ్లలో సైన్యం చేపట్టిన అతిపెద్ద ఆపరేషన్
- కీలక ప్రాంతాల్లో సైనికుల మోహరింపు
- 2003లో 65 మంది ఉగ్రమూకల హతం

**శ్రీనగర్, జూలై 28, (ప్రజాస్వరం ):** జమ్మూకశ్మీర్ కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు తర్వాత లోయలో ప్రశాంత వాతావరణం కనిపించింది. దీంతో భారతీయులు స్వేచ్ఛగా కశ్మీర్ కు రాకపోకలు సాగించారు. మరోవైపు విదేశీ పెట్టుబడులు కశ్మీర్ కు వస్తున్నాయి. అయితే రెండుళ్లుగా కశ్మీర్ లో మళ్లీ ఉగ్ర కదలికలు పెరిగాయి. కార్యకలాపాలు పెరుగుతున్నాయి. రెండేళ్లలో ఉగ్రవాదుల దాడుల్లో 48 మంది సైనికులు వీరమరణం పొందారు. ఇదిలా ఉంటే.. తాజాగా లోక్ సభ ఎన్నికల ఫలితాల తర్వాత, త్వరలో కశ్మీర్ లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో కశ్మీర్ లో ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారు. లోయలో అశాంతి, అభద్రత సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉగ్రవాదుల ఏరివేతకు భారత ఆర్మీ సిద్ధమైంది సర్ప్ వినాశ్ 2.0 పేరుతో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాలని నిర్ణయించింది. గడిచిన 21 ఏళ్లలో సైన్యం చేపట్టిన అతిపెద్ద ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ ఇదే. దీనిని నేరుగా ప్రధాన మంత్రి కార్యాలయం పర్యవేక్షిస్తుంది. 55 మంది ఉగ్రవాదులను ఏరివేయడమే లక్ష్యంగా ఇండియన్ ఆర్మీ ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సమాచారం. ఇక ఈ ఆపరేషన్ లో భాగస్వాములైన అధికారులు నేరుగా భద్రతా సలహాదారుకు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఆపరేషన్ సర్ప్ వినాశ్ లో భాగంగా 150 కిలోమీటర్ల మేర విస్తరించి.. నిటారుగా ఎక్కడం, దట్టమైన అడవులు, గుహలు వంటి అడ్డంకులను ఎదుర్కొనడం వంటి సవాళ్లు ఉంటాయి. ఇందుకు ఇండియన్ ఆర్మీ సిద్ధమైంది. విజయమే లక్ష్యంగా పనిచేయబోతోంది.

ఉగ్రవాదులను అంతమొందించేందుకు భారత సైన్యం ఆపరేషన్ చేపట్టింది. ఈమేరకు ఉగ్రవాదుల జాబితాను కూడా భారత ఆర్మీ సిద్ధం చేసింది. ఉగ్రవాదుల వెనుక ఉన్న ఉగ్రవాద సంస్థల జాబితా కూడా రూపొందించింది. రెండేళ్లలో మరణించిన 48 మంది సైనికుల త్యాగాలు వృథా కావొద్దన్న ఉద్దేశంతో, ఉగ్రవాద భయంతో వణుకుతున్న కశ్మీరీల మోములో ఆనందం చూడాలని ఈ ఆపరేషన్ చేపట్టారు.ఆపరేషన్ సర్ప్ వినాశ్ లో భాగంగా సైన్యం కీలకమైన ప్రాంతాల్లో సైనికులను మోహరించింది.

200 మంది స్నైపర్లు, 500 మంది పారా కమాండర్లతోపాటు 3 వేల మంది ఈ ఆపరేషన్ లో పాల్గొంటున్నారు. దేశంలోని ఇతర సెక్యూరిటీ ఏజెన్సీలను సమన్వయం చేసుకుంటూ ఇండియన్ ఆర్మీ ఈ ఆపరేషన్ నిర్వహిస్తుంది. 1995 నుంచి 2003 మధ్య కాలంలో ఇండియన్ ఆర్మీలో కీలకపాత్ర పోషించిన విలేజ్ డిఫెన్స్ గార్డ్స్ సహాయం కూడా తీసుకోనుంది. స్థానిక పరిస్థితుల, ఎదురయ్యే సవాళ్లపై వీరికి అవగాహన ఉంది. కీలక ఉగ్రవాదులను హతమార్చడంతోపాటు వారికి ఆహారం, ఆయుధాలు అందించే క్షేత్రస్థాయి నెట్ వర్క్ ను నిర్వీర్యం చేయడమే ఈ ఆపరేషన్ టార్గెట్. ఇండియన్ ఆర్మీ హిట్ లిస్ట్ లో 55 మంది ఉగ్రవాదులు ఉన్నారు. వీరి ఏరివేతే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ లో భాగంగా ప్రస్తుతం డోడా, కరువా, ఉధంపూర్, రాజౌరీ, పూంచ్, రియాసీలో సైనిక చర్య ప్రారంభమైంది. జమ్మూ కశ్మీర్ ను ఉగ్రవాద కేంద్రం చేయాలనుకుంటున్న పాకిస్తాన్ ప్రణాళికను ఈ ఆపరేషన్ తో విచ్ఛినం చేయనుంది ఇండియన్ ఆర్మీ. ఈ ఆపరేషన్ లో భాగంగా కఠినమైన సవాళ్లు ఏటవాలులు, అనేక గుహలు, సహజ రాతి మార్గాలు, అడవి జంతువులను ఆర్మీ ఎదుర్కొంటుంది.ఇదిలా ఉంటే.. కశ్మీర్ లోని దట్టమైన అడవులు ఉగ్రవాదులకు సహకరిస్తున్నాయి. అడవుల్లో సుమారు వెయ్యి గుహలు ఉన్నట్లు ఆర్మీ గుర్తించింది. వీటిలో ఉగ్రవాదులు తలదాచుకుంటున్నారని భావిస్తోంది.

ఈ ఆపరేషన్ లో మిషన్ లక్ష్యాలను సాధించడానికి స్థానిక బలగాలు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ కలిసి పనిచేస్తాయి ఆపరేషన్ సర్ప్ వినశ్ అనేది జమ్మూ కాశ్మీర్ లోని పీర్ పంజాల్ శ్రేణిలోని హిల్ కాకా పూంచ్ –సురన్ కోట్ ప్రాంతంలోని ఉగ్రవాద స్థావరాలను నిర్మూలించ డానికి 2003 ఏప్రిల్, మే నెలల్లో భారత సైన్యం మొదటిసారి చేపట్టింది. క్లిష్టమైన ఈ సైనిక చర్య జమ్మూ కాశ్మీర్ లో 65 మంది ఉగ్రవాదులను హతమార్చింది. అతిపెద్ద ఉగ్రవాద రహ స్య స్థావరాలను కూల్చివేసింది. 9 పారా–ఎస్ ఎఫ్ చే హిల్ కాకాలోని పీక్ 3689ని స్వాధీనం చేసుకోవడం ఈ ఆపరేషన్ లోని కీలక ఘట్టాల లో ఒకటి. అదనంగా, 6 రాష్ట్రీయ రైఫిల్స్, 163వ బ్రిగేడ్, 100వ బ్రిగేడ్ మరియు 15వ కార్ప్స్ వంటి విభా గాలు విస్తృత ఆపరేషన్ లో ముఖ్యమైన పాత్రలు పోషించాయి.

# భారీ మూల్యం తప్పదా..?

**హైదరాబాద్, జూలై 28 (ప్రజాస్వరం):** ప్రపంచంలో ప్రతి ఒక్కర్నీ వేధిస్తున్న ప్రధాన సమస్య స్థూలకాయం. వయో భేదం, లింగ బేధం లేకుండా స్థూల కాయం సమస్య తో ప్రపంచం మొత్తం సతమతం అవుతోంది. ఆహార నియమాలు, వ్యాయామం లేకపోవడం, జంక్ ఫుడ్‌కు అ లవాటు కావడం, పనిఒత్తిడి తదితర కారణాలతో ప్రతి ఒక్కరూ జీవితంలో ఈ సమస్యను అనుభవిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే స్థూల కాయంపై నిర్వహించిన సర్వేలో సంచలన వివరాలు వెల్లడయ్యాయి. 18-69 ఏళ్ల వయస్సు మధ్య గల స్త్రీ, పురుషుల్లో స్థూలకాయంపై జరిగిన ఈ సర్వేలో కోవిడ్ తర్వాత స్థూలకాయం గణనీయంగా పెరిగినట్టు సంస్థ వివరాలు వెల్లడించింది. సర్వే ప్రకారం సగటున దేశంలో 22.9 శాతం పురుషులు స్థూలకాయంతో బాధపడుతు న్నారు. గతంలో ఉన్న18.9 శాతంతో పోల్చితే 4% పెరిగి నట్టు సర్వే పేర్కొంది. ఇదే సందర్భంలో మహిళల్లోనూ స్థూలకాయం 20.6 శాతం నుంచి 24 శాతానికి పెరిగింది. స్థూలకాయంతో బాధపడుతున్న రాష్ట్రాల్లో ఢిల్లీ మొదటి స్థానం, ఆ తర్వాతి స్థానంలో తమిళనాడు ఉన్నా యి. ఢిల్లీలో మహిళల్లో ఒబేసిటీ 41.3 శాతం కాగా.. పురుషుల్లో 38 శాతంగా ఉంది. తమిళనాడులో 37 శాతం పురుషులు, 40.4 శాతం మహిళలు స్థూలకా యంతో ఇబ్బంది పడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో స్థూల కాయంతో బాధపడుతున్నవారిలో మహిళలు 36.3 శాతం, పురుషులు 31.1 శాతం ఉండగా, తెలంగాణలో స్థూలకాయంతో బాధపడుతున్నవారిలో మహిళలు 30.1 శాతం, పురుషులు 32.3 శాతంగా ఉన్నారు. అంటే తెలంగాణలో స్త్రీల కంటే పురుషులే ఎక్కువ ప్రమాదంలో ఉన్నారు. గ్రామాల కన్నా ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో స్థూలకాయం పెరిగినట్టు సర్వేలో గుర్తించారు. కోవిడ్-19 మహమ్మారి విజృంభించిన (2019-2021)లో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే నిర్వహించింది. మహమ్మారి విస్తృతి, లాక్‌డౌన్ ప్రభావంతో పరిమిత స్థాయిలో శారీరక శ్రమ కారణంగా స్థూలకాయం గణనీయంగా పెరిగినట్టు సర్వేలో వెల్లడైంది. స్థూలకాయం అనేది ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మందిని ప్రభావితం చేసే అత్యంత సంక్లిష్టమైన మరియు ఎక్కువగా నివారించగల వ్యాధులలో ఒకటి. దీనిని గమనించకుండా వదిలేస్తే, 2030 నాటికి ప్రపంచంలోని యువ జనాభాలో దాదాపు 38% మంది అధిక బరువుతో, దాదాపు 20% మంది ఊబకాయంతో బాధపడుతారని అంచనా వేశారు. మహిళలు ఊబకాయం కారణంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. టైప్ 2 మధుమేహం, కరోనరీ ఆర్టరీ వ్యాధి, శ్వాసకోశ సంబంధిత సమస్యలు, గర్భధారణ సమస్యలు (వంధ్యత్వం), లైంగిక సమస్యలు, హార్మోన్ల అసమతుల్యం, ఎండోమెట్రియల్, అండాశయ, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ వంటి వివిధ రకాల క్యాన్సర్‌లకు ఊబకాయం ప్రమాద కారకం ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. పురుషుల్లోనూ స్థూల కాయం కారణంగా జీర్ణ సమస్యలు, గ్యాస్ట్రిక్ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. ఇటీవలి కాలంలో గుండె సంబంధిత వ్యాధులతో




పురుషులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సరైన ఆహారం తీసుకోవడం, చురుకుగా ఉండటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా శరీర బరువును నియంత్రణలో ఉంచుకుంటే ఆరోగ్య సమస్యలు రాకుండా చేసుకోవచ్చు. మారుతున్న కాలానికి అనుగుణంగా జీవన విధానంలో మార్పులు చేసుకుంటే స్థూలకాయం రాకుండా జాగ్రత్త పడొచ్చని న్యూట్రిషియనిస్టులు చెబుతున్నారు.

# ఓరుగల్లులో రచ్చరచ్చ..

**వరంగల్, జూలై 28, (ప్రజాస్వరం) :** ఓరుగల్లులో గట్టి సవాల్ విసురుతోంది బీఆర్ ఎస్. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యాలయాలకు నోటీసులిస్తున్న ప్రభుత్వం.. హన్మకొండలో నిర్మించిన బీఆర్ ఎస్ భవన్ కూ నోటీసులు జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన బీఆర్ ఎస్ పార్టీ ఆఫీస్ కూల్చివేతకు నోటీసులిచ్చింది. అయితే, ప్రభుత్వం జారీ చేసిన నోటీసులపై న్యాయపోరాటం ప్రారంభించిన బీఆర్ఎస్... స్థానిక రాజకీయాలను దీటుగా ఎదుర్కోవాలని నిర్ణయించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి కూడా బీఆర్ ఎస్ పార్టీ ఆఫీసు కూల్చివేయాల్సిందనేనట్లు కంకణం కట్టుకోవడంతో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ రంగంలోకి దిగి ఎమ్మెల్యేను దీటుగా ఎదుర్కొంటున్నారు . ప్రస్తుతం దూకుడు మీదున్న కాంగ్రెస్ ను ఎదుర్కోవాలంటే చాలా చోట్ల బీఆర్ ఎస్ నేతలు వెనక్కి తగ్గుతున్నారు. ఇంకా నాలుగున్నరేళ్లు అధికారం మిగిలి వుండగా, కాంగ్రెస్ నేతలతో తగాదా ఎందుకంటూ సైడైపోతున్నారనే వాదన వినిపిస్తోంది. కానీ, ఓరుగల్లులో ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆఫీసు కూల్చివేస్తామని కాంగ్రెస్ బెదిరిస్తుంటే... కాంగ్రెస్ కార్యాలయమూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారంటూ ప్రత్యారోపణలతో కాకరేపుతున్నారు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్. పార్టీ ఆఫీసు కోసమని ప్రభుత్వం వద్ద స్థలం తీసుకున్న కాంగ్రెస్ అందులో కమర్షియల్ కాంప్లెక్స్ నడపడం ఎంతవరకు కరెక్టు అంటూ ప్రశ్నిస్తున్నారు.

గత ఎన్నికల్లో ప్రత్యర్థులుగా పోటీ చేసిన ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మధ్య మాటల యుద్ధం పతాకస్థాయిలో కొనసాగుతోంది. 2009 నుంచి గత అసెంబ్లీ ఎన్నికల వరకు ఎమ్మెల్యేగా పనిచేసిన వినయ్ భాస్కర్ ను ఇరకాటంలో పెట్టేలా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి పావులు కదుపుతున్నారు. సమాచార హక్కు చట్టాన్ని అస్త్రం చేసుకుని మాజీ ఎమ్మెల్యేను, బీఆర్ఎస్ ను రాజేందర్ రెడ్డి టార్గెట్ చేయడంతో రాజకీయం వాడివేడిగా మారింది. దూకుడుమీదున్న ఎమ్మెల్యేను అడ్డుకోవడానికి వినయ్ భాస్కర్ కూడా జోరు చూపిస్తుండటంతో ఓరుగల్లు పంచాయితీ ఆసక్తికరంగా మారింది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ రాజకీయ అనుభవంతో బీఆర్ఎస్ టార్గెట్ గా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి అన్ని వైపుల నుంచి ఒత్తిడి తెస్తుండటం.. కోర్టులో కేసులు వేసి బీఆర్ ఎస్ ను ముప్పతిప్పలు పెడుతుంటే బీఆర్ఎస్ కూడా అంతే స్థాయిలో ప్రతిస్పందిస్తూ.. తలవంచేది లేదన్నట్లు సంకేతాలు పంపుతోంది. దీంతో ఓరుగల్లు రాజకీయం రక్తికడుతోందంటున్నారు రాజకీయల విశ్లేషకులు. మొత్తానికి రాష్ట్రంలో ఎక్కడా లేనట్లు అధికార, ప్రతిపక్షాలు ఢీ అంటే ఢీ అన్నట్లు తలపడుతుండటమే హైలెట్ గా నిలుస్తోంది.

# జాబిల్లిపై నీటిజాడ



- 2020లో చైనా 'చాంగ్ 5' ఉపగ్రహ ప్రయోగం
- రెండు కిలోల మట్టి నమూనాలు తీసుకొచ్చిన వ్యోమనౌక
- నీటి అణువులు ఉన్నట్లు నిర్ధారించిన సీఏఎస్ శాస్త్రవేత్తలు

**బీజింగ్, జూలై 28, :** చందమామ రావే.. జాబిల్లి రావే.. కొండెక్కి రావే.. అంటూ చిన్నప్పుడు చందమామను చూపిస్తూ పిల్లలకు తల్లులు అన్నం తినిపించే దృశ్యాలు ఇప్పటికీ గ్రామాల్లో మనకు కనిపిస్తుంటాయి.ఇన్నాళ్లూ అందదు అని భావించిన చందమామ అందే రోజులు అతిత్వరలోనే రానున్నాయంటున్నారు శాస్త్రవేత్తలు. ఈ మేరకు ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇటీవలే భారత్ చంద్రయాన్ –3 లో భాగంగా రాకెట్ ను చంద్రుడిపైకి పంపించింది. రెండు చంద్రయాన్–1, చంద్రయాన్ –2 విఫలమైనా.. చంద్రయాన్ – 3తో భారత్ కూడా ప్రపంచంలో ఇప్పటి వరకు చంద్రుడిపైకి వెళ్లేందుకు ఇతర దేశాలు చేసిన ఖర్చుకన్నా తక్కువ ఖర్చుతో శాటిలైటను భారత్ చంద్రుడిపైకి పంపింది. ఈ శాటిలైట్ సూర్యుడి శక్తి ఆధారంగా పనిచేసింది. చంద్రుడిపై విజయవంతంగా ల్యాండ్ అయిన ఉపగ్రహం సుమారు ఐదు రోజులపాటు అక్కడి దృశ్యాలను కిందకు పంపించింది. తర్వాత చీకటి రావడంతో పనిచేయడం మానేసింది.

ఇక ఇదే సమయంలో రష్యా కూడా ఉప గ్రహాన్ని చంద్రుడిపైకి పంపించింది. కానీ, అది విజయవంతం కాలేదు. ఆ తర్వాత చైనా కూడా చంద్రుడి అవతలివైపు ఉపగ్రహాన్ని విజయవంతంగా లాంచ్ చేసింది. చాంగే – 5 సాయంతో జాబిల్లి నుంచి భూమికి మట్టిని తీసుకువచ్చిన చైనా.. నాలుగేళ్లుగా పరిశోధనలు చేస్తోంది. ఈ క్రమంలో ఈ పరిశోధనల ఫలితాల ఆధారంగా చంద్రునిపై నీరు ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ విషయాన్ని చైనీస్ అకాడమి ఆఫ్ సైన్సెస్ వెల్లడించింది. చంద్రుడిపై మట్టి నమూనాల సేకరణే లక్ష్యంగా చైనా 2020లో చేపట్టిన చాంగే – 5 చంద్రుడి ఉపరితలం నుంచి దాదాపు 2 కిలోల మట్టి, రాళ్ల నమూనాలను భూమిపైకి తీసుకువచ్చింది. అనంతరం వాటిపై బీజింగ్ లోని నేషనల్ లేబొరేటరీ ఫర్ కండెన్స్ డ్ మ్యాటర్ ఫిజిక్స్, సీఏఎస్ కు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్ పరిశోధకులు అధ్యయనం చేస్తున్నారు. ఆ నామూనాల్లో విస్తృత స్థాయిలో నీటి అణువులు ఉన్నట్లు గుర్తించారు. ఈమేరకు సీఏఎస్ ఇటీవల పేర్కొంది. ఇందుకు సంబంధించిన పరిశోధన పత్రాన్ని ఓ జర్నల్ లో ప్రచురించినట్లు పేర్కొంది.

ఇదిలా ఉండగా అమెరికాకు చెందిన ఇద్దరు వ్యోమగాములు 40 ఏళ్ల క్రితమే చంద్రుడిపైకి వెళ్లి మట్టి నమూనాలు సేకరించారు. అనంతరం సోవియట్ యూనియన్ కూడా 1976లో మట్టి నమూనాలను భూమికి తీసుకువచ్చింది. అయితే 2009లో భారత్ ప్రయోగించిన చంద్రయాన్–1 వ్యోమనౌక చంద్రుడిపై నీటిజాడ ఉన్నట్లు గుర్తించింది. దీనికి సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపలేదు. దీంతో భారత వాదనను ఎవరూ విశ్వసించలేదు. కానీ, భారత వాదనే నిజమని చైనా సైతం ధ్రువీకరించింది.

# ఉద్యోగార్థుల్లో ఆందోళన

- పోటీ పరీక్షల వాయిదాలతో అయోమయం
- గ్రూప్ 1 రద్దు.. రివైజ్డ్ షెడ్యూల్ ప్రకారం తిరిగి ఎగ్జామ్
- గ్రూప్ 2 డిసెంబర్ కు వాయిదా
- ఏండ్లుగా ప్రిపేరవుతున్న అభ్యర్థుల్లో అసహనం

**హైదరాబాద్, జూలై 28 (ప్రజాస్వరం) :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన దాదాపు 9 ఏళ్లకు తెలంగాణలో గ్రూప్–2 పోస్టుల భర్తీకి 2022 డిసెంబర్ లో నాటి టీఎస్ పీఎస్సీ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ దాదాపు 700 పోస్టులతో విడుదల చేసి ఏడాది దాటింది. కానీ, ఇప్పటికీ పరీక్షలు జరుగలేదు. అంటే 40 ఏళ్ల ఉద్యోగార్హతతో దరఖాస్తు చేసున్న అభ్య ర్థుల అర్హత వయసు కూడా దాటిపోయింది. అయినా.. ఇప్పటికీ పరీక్ష నిర్వహించి ఫలితాలు ఇవ్వలేదు. కారణాలు ఏదైనా.. నిరుద్యోగుల జీవితాలతో గత బీఆర్ ఎస్ ప్రభుత్వం ఆటలాడుకుంది అన్నది వాస్తవం. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేదని.. ఇచ్చినా పరీక్షలు నిర్వహించడం లేదని.. పరీక్షలు నిర్వహించినా ప్రశ్నపత్రాలు లీక్ చేస్తుంది అన్న కారణాలతో 2023 నవంబర్ లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఓడించారు. కాంగ్రెస్ ను అధికారంలోకి తెచ్చారు. కానీ, ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా గ్రూప్–2 పరీక్ష నిర్వహించలేకపోయింది. టీఎస్ పీఎస్సీని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రక్షాళన చేసింది. కొత్త కమిటీని నియమించింది. తర్వాత టీఎస్ పీఎస్సీ పేరును టీజీపీఎస్సీగా మార్చింది. కానీ, గ్రూప్–2 పరీక్ష నిర్వహించలేదు. గడిచిన ఆరు నెలల్లో కేవలం గ్రూప్ –1 పరీక్ష నిర్వహించడానికే ఆరు నెలల సమయం తీసుకుంది. షెడ్యూల్ ప్రకారం గ్రూప్ – 2 పరీక్ష ఆగస్టు 7, 8వ తేదీల్లో నిర్వహించాల్సి ఉంది. కానీ, దానిని కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం డిసెంబర్ కు వాయిదా వేసింది. డిసెంబర్లో ఎప్పుడు నిర్వహిస్తారనేది టీజీపీఎస్సీ కూడా స్పష్టత ఇవ్వలేదు. అభ్యర్థుల విన్నపం మేరకే ఇచ్చామంటున్నా.. అది చాలా మంది విద్యార్థుల్లో అసహనాన్ని పెంచుతుంది. తెలంగాణ రాష్ట్రం వస్తే ఇంటికో ఉద్యోగం వస్తుందని ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో 2014 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించిన టీఆర్ ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నేతృత్వంలో కొత్త రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడింది. దీంతో తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన లక్షలాది మంది ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూశారు. కానీ కేసీఆర్ సర్కార్ పోలీస్ రిక్రూట్ మెంట్ కే అధిక ప్రాధాన్యం ఇచ్చింది. చివరకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 8 ఏళ్ల తర్వాత 18 శాఖల్లోని ఖాళీల భర్తీకి 2022, డిసెంబర్ లో గ్రూప్–2 స్థాయి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. 2023 ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొంది. అయితే అదే సమయంలో గ్రూప్–1 ప్రశ్నపత్రం లీక్ అయింది. దీంతో గ్రూప్–1 పరీక్ష రద్దు చేసిన టీఎస్ పీఎస్సీ, గ్రూప్ –2ను కూడా వాయిదా వేసింది. తర్వాత అదే ఏడాది నవంబర్ లో పరీక్షలు నిర్వహిస్తామని తర్వాత టీఎస్ పీఎస్సీ ప్రకటించింది.

అంతకన్నా ముందే గ్రూప్–1 పరీక్ష మళ్లీ నిర్వహించింది. అయితే పరీక్ష నిర్వహణలో లోపాలతో అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ పరీక్షను కూడా కోర్టు రద్దు చేసింది. గ్రూప్–2 పరీక్షను టీఎస్ పీఎస్సీ డిసెంబర్ కు వాయిదా వేసింది. అయితే 2023 నవంబర్ లో అసెంబ్లీ ఎన్నికలు జరగడం, బీఆర్ ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడం, టీఎస్ పీఎస్సీ ప్రక్షాళనకు చర్యలు చేపట్టడంతో డిసెంబర్ లో కూడా గ్రూప్–2 నిర్వహించలేదపోయింది. టీఎస్ పీఎస్సీ ప్రక్షాళన తర్వాత కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీ.. గ్రూప్–1 పరీక్షను జూన్ లో, గ్రూప్–2 పరీక్షను ఆగస్టు 7, 8 తేదీల్లో, గ్రూప్ –3ని డిసెంబర్ లో నిర్వహించాలని నిర్ణయించింది. ఈమేరకు షెడ్యూల్ విడుదల చేసింది. రివైజ్డ్ షెడ్యూల్ ప్రకారం.. గ్రూప్–1 పరీక్షను నిర్వహించింది. ఫలితాలు కూడా ప్రకటించింది. ఇక గ్రూప్–2 పరీక్ష ఆగస్టు 7, 8వ తేదీల్లో నిర్వహించాల్సి ఉండగా, డీఎస్సీ పరీక్ష జూలై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో డీఎస్సీ రాసే వారిలో చాలా మంది గ్రూప్ –2కు సిద్ధమవుతున్న నేపథ్యంలో పరీక్ష వాయిదా వేయాలని కోరారు. ఆందోళనలు చేశారు. టీజీపీఎస్సీని ముట్టడించారు. చివరకు ప్రభుత్వం అభ్యర్థుల ఒత్తిడికి దిగివచ్చింది. ఆగస్టులో నిర్వహించాల్సిన పరీక్షను డిసెంబర్ కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఏ తేదీన నిర్వహించేది స్పష్టత ఇవ్వలేదు. పరీక్షల వాయిదాలతో ఇప్పటికే నిరుద్యోగుల్లో అసహనం పెరిగింది. ఇప్పటికే అభ్యర్థులు రెండేళ్లుగా ప్రిపరేషన్ లో ఉన్నారు. వాయిదాల కారణంగా పేద అభ్యర్థులు చదువుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు కోచింగ్ సెంటర్లు లాభపడుతున్నాయి. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి కూడా అంగీకరించారు. కానీ, అభ్యర్థుల ఒత్తిడితో పరీక్షను వాయిదా వేశారు. కానీ, వాయిదాలతో ప్రభుత్వం ఇబ్బంది పడాల్సి వస్తుందన్న విషయాన్ని ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి గుర్తించాల్సిన అవసరం ఉంది.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక







# నల్ల పోచమ్మ బోనాలు

**మెదక్, జులై 28 (ప్రజా స్వరం) :**

నల్ల పోచమ్మకి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కుటుంబ సమేతంగా బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రం తారక రామనగర్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆయన సతీమణి శ్రీజ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆషాఢ బోనాల పండగ అంటే గ్రామ దేవత అమ్మవారిని పూజించే పండుగ భోజనం ప్రకృతి బోనం వికృతి బోనం అంటే భోజనం దీన్ని కొత్తకుండలో వండి ప్రదర్శనగా వెళ్లి గ్రామదేవతలకు భక్తి ప్రపత్తులతో సమర్పిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రజలు గ్రామ దేవతలను భక్తి ప్రపత్తులతో నైవేద్యాన్ని బోనం పేరుతో సమర్పిస్తుంటారన్నారు. బోనాలు పండుగను రాష్ట్ర పండుగగా ఉన్నది కాబట్టి బోనాల పండుగ మరింత శోభను సంతరించుకున్నదన్నారు. సాధారణ ప్రజలే కాదు ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా ఈ ఉత్సవాల్లో పాల్గొని తమ భక్తిని చాటుకుంటున్నారన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో పాడి పంటలు, సుఖ సంతోషాలతో ఆనందమయంగా మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## బోనాల ఉత్సవాల్లో తిరుపతిరెడ్డి..

**రామాయంపేట. ప్రజా సర్వం :**

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంటారెడ్డి తిరుపతిరెడ్డి పర్యటించారు. ఆషాడ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. స్థానిక మహంకాళి మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు నాగరాజు, కృష్ణగౌడ్, రాములు, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## బోనాల ఊరేగింపులో పాల్గొన్న మైనంపల్లి సతీమణి వాణి...

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో నిర్వహించిన బోనాల ఊరేగింపు కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తల్లి మైనంపల్లి వాణిహనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్థానిక మహంకాళి మాత దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాత్‌రావు, అధికార ప్రతినిధి పల్లె రామచంద్రగౌడ్, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎస్ఐ చర్చ్‌లో భక్తుల సందడి

**మెదక్, జులై 28 (ప్రజా స్వరం) :**

మెదక్ జిల్లా కేంద్రం ప్రఖ్యాతి గాంచిన సీఎస్ఐ చర్చిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. పెళ్లి ఆదివారంగా ఆరాధనలో వచ్చిన దంపతులు కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దంపతులకు గురువులు రోజా పువ్వులను అందజేశారు. మొదటి ఆరాధనలో ప్రెస్ బిటర్ ఇన్చార్జి శాంతయ్య భక్తులకు ప్రార్థనల అనంతరం గురువులు ఆశీర్వచనాలు అందజేశారు. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్చ్ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాటు చేశారు.



## ఆగి ఉన్న బైక్‌ను ఢీకొన్న కారు

**పారిశుధ్య కార్మికుడు మృతి - మెదక్ జిల్లా కేంద్రంలో ఘటన**

**మెదక్, జులై 28 (ప్రజా స్వరం) :**

అతివేగం పారిశుధ్య కార్మికుడి ప్రాణాలు బలితీసుకుంది. వేగంగా వచ్చిన కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మెదక్ పట్టణానికి చెందిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మెదక్ మండలం మక్త భూపతిపూర్ గ్రామానికి చెందిన కర్రోల మైసయ్య (55) గత ఆరేళ్లుగా మెదక్ మున్సిపల్‌లో సఫాయి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మెదక్ పట్టణంలోని గోల్కొండ వీధిలో భార్య రత్నమ్మ కుమారులతో కలిసి ఉంటున్నాడు. బోనాల



పండుగ కావడంతో దుర్గా కాలనీ సమీపంలో డ్రైనేజీ క్లీన్ చేయడానికి మైసయ్య బైక్‌పై వచ్చాడు. అక్కడ రోడ్డు పక్కన బైక్ ఆపి ఉన్న సమయంలో వెనకనుంచి అతివేగంగా వచ్చిన కారు బైకును ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైన మైసయ్య అక్కడికక్కడే మృతి




చెందాడు. గమనించిన స్థానికులు ప్రమాదానికి కారణమైన కారును పట్టుకునేందుకు ప్రయత్నం చేయగా పరారయ్యారు. కారులో మైనర్లే ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై మున్సిపల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.





## తెలంగాణా సంప్రదాయమే..
# బోనాలు





**వికారాబాద్, జూలై 28 (ప్రజా స్వరం):** వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ఆదివారం ఆషాడ మాసం బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా జరుపుకొన్నారు. తాండూర్ పట్టణంలోని కాళికాదేవి ఆలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ముఖ్యతిథిగా పాల్గొన్నారు. ఆయన సోదరుడు ఆర్బి ఓఎల్ ఫ్యాక్టరీ యజమాని కాంగ్రెస్ నాయకుడు బుయ్యని శ్రీనివాసరెడ్డి కూడా అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ కమిటీ అలాగే ఆలయ పూజారులు వారిని ఘనంగా సన్మానించారు.

### ఆదర్శనగర్‌లో కట్ట మైసమ్మకు..

తాండూరు పట్టణం ఆదర్శనగర్‌లో కట్ట మైసమ్మ తల్లి, మల్‌రెడ్డిపల్లిలో పోచమ్మ తల్లి, గాంధీనగర్‌లో కట్ట మైసమ్మ దేవాలయాలలో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే బుయ్యని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ సకాలంలో వర్షా లు కురిసి పాడి పంటలతో ప్రజల సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. సాయిపూర్‌లోని రాయకుంట కట్టమైసమ్మ తల్లికి భారీ ఎత్తున బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అంగరంగ వైభవంగా దేవతామూర్తుల అలంకరణలతో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు.

### బోనమెత్తిన సునీతారెడ్డి...

చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలంలోని గోల్లూరుగూడలో వికారాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఆదివారం వైభవంగా బోనాల పండుగ జరిగింది. ముఖ్యతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డి సొంతింటి నుంచి అమ్మవారికి బోనం ద్వారా నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు, ఆడపడుచులు సునీతారెడ్డికి ఘన స్వాగతం పలికారు.

### మున్సిపాలిటీ పరిధిలో...

వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శివరాంనగర్, సింగారపు రాచయ్య కాలనీల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వనాథం, సత్యనారాయణ, యువ నాయకుడు శ్రీనివాస్‌ముదిరాజ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.











# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

### పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**వికారాబాద్, జూలై 28 (ప్రజాస్వరం):** వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో ఆదివారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేపటి తరాలకు ఆస్తులు, అంతస్తులు ఇవ్వకున్నా పర్వాలేదు కానీ, ఆక్సిజన్ లేకుంటే బతకలేరు చెట్లను పెంచండి ప్రకృతిని పరిరక్షించుదామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమం ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, పురపాలక చైర్మన్ అశోక్‌కుమార్, కమిషనర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**వికారాబాద్, జూలై 28(ప్రజా స్వరం) :** పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ( సీఐటీయూ) కోరింది. ఈ నెల 30 చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబధించిన కరపత్రాన్ని ఆదివారం పెద్దేముల్ మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు అమలు చేస్తానని హామీనిచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి 7 నెలలు పూర్తయినా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక పోరాటాల ఫలితంగా పెండింగ్ వేతనాలు రూ.150 కోట్ల నిధులు మంజూరు చేసిందని, కానీ, కింది స్థాయిలో చాలా పంచాయతీల్లో కూడా పెండింగ్ వేతనాల గ్రాంట్ రాని పరిస్థితి నెలకొన్నదన్నారు. తక్షణమే పెండింగ్ వేతనాలు మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే జీవో నెంబర్ 51 సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం పూర్తిగా రద్దు చేయాలని, కారోబార్ బిల్ కలెక్టర్లకు సహాయ కార్యదర్శిగా నియమించాలని, అర్హత గల ఇతర సిబ్బందిని కూడా పర్మినెంట్ చేయాలన్నారు. పంచాయతీ సిబ్బందికి రూ.5లక్షల ఇన్సూరెన్స్, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు రూ.10 లక్షలు ప్రకటించాలన్నారు. ఈ నెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపినిచ్చారు. కార్యక్రమంలో అంబరప్ప, రాములు, బాలమ్మ, వెంకటమ్మ, రాసమ్మ, వీరప్ప, సంఘప్ప తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలకు ఎల్వోసీ అందజేత



**వికారాబాద్, జూలై 28(ప్రజా స్వరం) :** వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సీఎం సహాయనిధి చెక్కులను నియోజకవర్గంలోని దోమ, కుల్కచర్ల, చౌడపూర్, మహమ్మదాబాద్, పూడూర్, గండిడ్ మండలాలకు చెందిన 55 మంది లబ్ధిదారులకు రూ.54 లక్షల విలువైన ఎల్‌వోసీలను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. అలాగే వికారాబాద్ మున్సిపల్‌లోని అనంతగిరిపల్లికి చెందిన బాలమణికి చికిత్స నిమిత్తం అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.50వేలు ఎల్‌వోసీని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి లబ్ధిదారుకు అందజేశారు. కార్యక్రమంలో రెడ్యానాయక్, అనంతయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

ఆదివారం, 28 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM


# మనవాళ్లను ప్రోత్సహిద్దాం



## 'మన్‌కీ బాత్'లో పారిస్ ఒలింపిక్స్‌పై ప్రధాని మోడీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జూలై 28 (ప్రజాస్వరం): 112వ 'మన్ కీ బాత్'లో పారిస్ ఒలింపిక్స్ పై ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచమంతా పారిస్ ఒలింపిక్స్ గురించి చర్చించుకుంటుందన్నారు. అంతర్జాతీయ వేదికపై మువ్వన్నెల జెండా రెపరెపలాడాలని ప్రధాని కాంక్షించారు. ఒలింపిక్స్లో పోటీ పడుతున్న మన క్రీడాకారులను పోత్సహిద్దామని పిలుపునిచ్చారు. మ్యాథ్స్ ఒలింపియాడ్ విజేతలకు మోడీ ప్రశంసలు తెలియజేశారు. డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించేందుకు మానస్ హెల్ప్ లైన్ వినియోగించుకోవాలని ప్రధాని మోడీ దేశ ప్రజలకు కోరారు. డ్రగ్స్ సరఫరా, వినియోగం గురించి సమాచారం తెలిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందజేయాలని రిక్వెస్ట్ చేశారు.

## భాగ్యలక్ష్మి అమ్మవారి గుడిని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తా : బండి



హైదరాబాద్, జూలై 28 (ప్రజాస్వరం) : రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే భాగ్యలక్ష్మి అమ్మవారి గుడిని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. భాగ్యనగర గల్లీ గల్లీలో బోనాల జాతర కొనసాగుతుందన్నారు. హిందువుల పండుగలను పాతబస్తీలో జరుపుకునే పరిస్తితి లేదని కొంతమంది భక్తులు ఆవేదన చెందుతున్నారు. బీజేపీ ప్రభుత్వం వస్తే పాతబస్తీలో కూడా గల్లీ గల్లీలో మన పండుగ జరుగుతుందన్నారు. హైదరాబాద్ బోనాల పండుగకు 5 లక్షలు మాత్రమే ఇచ్చిన ప్రభుత్వం రంజాన్ పండుగకు రూ.33 కోట్లు ఇచ్చారని తెలిపారు. బీజేపీ అధికారంలోకి రాగానే భాగ్యలక్ష్మి అమ్మవారి టెంపుల్ ను గోల్డెన్ టెంపుల్ గా మారుస్తామన్నారు. అక్బరుద్దీన్ ను డిప్యూటీ సీఎం చేస్తా అని సీఎం అంటున్నారు. దమ్ముంటే కొడంగల్‌లో అక్బరుద్దీన్ ఓవైసీ పోటీ చేస్తే డిపాజిట్ రాకుండా చేస్తామన్నారు.

## అంబర్‌పేట మహంకాళిని దర్శించుకున్న కిషన్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 28 (ప్రజాస్వరం) : బోనాల ఉత్సవాల సందర్భంగా అంబర్ పేటలోని మహంకాళి అమ్మవారిని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా.. భాగ్యనగరంతోపాటు తెలంగాణలోని మారుమూల ప్రాంతాల్లో, గ్రామాల్లో జరిగే గొప్ప వేడుక బోనాల పండుగ. ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రకృతి వైపరీత్యాలు, విషజ్వరాలు రాకూడదని, మంచి వర్షాలతో, పాడి పంటలతో అందరూ కూడా ఇబ్బందులు లేకుండా ఉండాలని అమ్మవారిని కోరుకునే పండుగ ఈ బోనాలు అన్నారు. అంబర్ పేట మహంకాళి అమ్మవారి దేవాలయంలో అనేక సంవత్సరాలుగా అద్భుతంగా బోనాల పండుగ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల వారు ఈ బోనాల పండుగను వారం పది రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. గ్రామాల్లో ఏ రకంగా అంతా కలిసి ఉంటారో.. అంబర్ పేటలో కూడా అందరూ కలిసి ఐక్యమత్యంగా ఉంటూ పండుగా చేస్తారని అన్నారు. ఈ బోనాల పండుగ సందర్భంగా అంబర్ పేట.. ఈ చుట్టు పక్కల ఉన్న ప్రజలు అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు తీసుకుంటారు. దేవాలయ కమిటీ కూడా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అద్భుతంగా ఏర్పాట్లు చేసిందని కిషన్ రెడ్డి అన్నారు.





# సింహవాహినికి పట్నం బోనం

❑ ఘనంగా లాల్‌దర్వాజా బోనాలు ❑ ఉదయం నుంచే ప్రత్యేకమైన పూజలు ❑ బారులతీరిన భక్తులు

హైదరాబాద్, జూలై 28 (ప్రజాస్వరం) : హైదారబాద్ లోని ఓల్డ్ సిటీలో లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే లాల్ దర్వాజా సింహవాహిని ఆలయం వద్ద భక్తుల కొలహలం నెలకుంది. ఈ ఏడాది లాల్ దర్వాజా 116వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు అధికారులు. అమ్మవారికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు బోనాలు సమర్పించే అవకాశం ఉంది. రెండు రోజుల పాటు జరిగే బోనాల ఉత్సవాల కోసం అన్ని శాఖల సమన్వాయంతో ఏర్పాట్లు చేశారు. రేపు రంగం భవిష్యవాణి, పోతరాజుల ఆటపాటలతో ఘటాల ఊరేగింపు ఉండనుంది.

### ఆలయాలను దర్శించుకున్న మంత్రులు

పాతబస్తిలోని ప్రధాన 23 ఆలయాల వద్ద బోనాల జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శాలబండ అక్కన్న మాదన్న ఆలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. మరోవైపు కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ, మీరాలం మండి మహంకాళి ఆలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సబ్జీ మండి నల్ల పోచమ్మ ఆలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఇంకా చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్టీఆర్ నగర్ సరూర్ నగర్ ఖిలా మైసమ్మ ఆలయంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క, నాచారం ఉప్పల్ మహంకాళి సహిత మహాకాళేశ్వర స్వామి ఆలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

## ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం : భట్టి

లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల ఉత్సవాల్లో జిల్లా ఇన్ చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు భట్టి విక్రమార్క దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు ఆలయ కమిటీ, ఎండోమెంట్ అధికారులు భట్టికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క బోనాలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. తెలంగాణ వారసత్వ సంపదను ప్రభుత్వం పరిరక్షిస్తుందని అన్నారు. బోనాల పండగ ఘనంగా నిర్వహించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.20 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. అన్నివర్గాల ప్రజలు సామర్యంగా జీవిస్తున్న గొప్ప నగరం హైదరాబాద్. ఈ నగరం అభివృద్ధి కోసం బడ్జెట్ లో రూ.10వేల కోట్లు కేటాయించామన్నారు.



## కొత్త గవర్నర్ కు సీఎం శుభాకాంక్షలు

హైదరాబాద్, జూలై 28 (ప్రజాస్వరం) : తెలంగాణకు కొత్త గవర్నర్ గా జిష్ణుదేవ్ వర్మ నియామకంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. తెలంగాణ ప్రజల తరపున జిష్ణుదేవ్ వర్మను స్వాగతిస్తున్నానని ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. అన్ని భవిష్యత్ ప్రయత్నాలకు శుభాకాంక్షలు అని తెలిపారు. కాగా, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ సహా మొత్తం 10 రాష్ట్రాలకు గవర్నర్లనునియమించింది. తెలంగాణ గవర్నర్ గా నియమితులైన జిష్ణుదేవ్ వర్మ గతంలో త్రిపుర మాజీ ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు. ఈయన త్రిపుర రాజకుటుంబానికి చెందిన వ్యకి. రామ జన్మభూమి ఉద్యమ సమయంలో 1990లో బీజేపీలో చేరారు. అయితే ఇన్నాళ్లు తెలంగాణ గవర్నర్ గా అదనపు బాధ్యతలు నిర్వహించిన జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణను కేంద్రం మహారాష్ట్రకు బదిలీ చేసింది.



## భాగ్యలక్ష్మి ఆలయంలో కోమటిరెడ్డి

ఆషాడం బోనాల సందర్భంగా ఇవాళ చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రభుత్వం తరపున మంత్రి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోయేలా కాంగ్రెస్ కుట్ర పన్నుతున్నదనే అనుమానాలు కలుగుతున్నాయన్న కేటీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. పోటీ చేసిన సగం సీట్లలో డిపాజిట్లు రాని పార్టీ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది అని సెటైర్ వేశారు.

# హైదరాబాద్ అంటే గంగా-జమునా తెహజీబ్

### కుతుబ్ షాహీ హెరిటేజ్ పార్క్ పునరుద్ధరణ ప్రాజెక్ట్ ముగింపు కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 28 (ప్రజాస్వరం) : కుతుబ్ షాహీ హెరిటేజ్ పార్క్ పునరుద్ధరణ ప్రాజెక్ట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కుతుబ్ షాహీ టూంబ్స్ ను మంత్రి జూపల్లి కృష్ణారావు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్తో కలిసి సందర్శించిన రేవంత్ రెడ్డి అక్కడ మొక్కను నాటారు. అనంతరం మాట్లాడుతూ వేల ఏళ్ల నాటి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలతో నిండిన తెలంగాణ ప్రతి ఒక్కరికి స్వాగతం పలుకుతుందని అన్నారు. శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్ షాహీలతో పాటు ఇతరులు ఈ ప్రాంతంపై తమదైన సాంస్కృతిక ముద్రను వేశారని పేర్కొన్నారు. చార్మినార్, గోల్కొండ కోట, కుతుబ్‌షాహి సమాధులు, పైగా సమాధులు, వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం, అలంపూర్ ఆలయాలు వంటివి అద్భుతాలకు తెలంగాణ నిలయమని చెప్పారు. శతాబ్దాలుగా హైదరాబాద్ 'గంగా-జమునా తెహజీబ్' గా పిలువబడుతూ.. బహుళ జాతులు, సంస్కృతుల సామరస్యాన్ని, సహజీవనాన్ని చూసిందని తెలిపారు. తమ ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుతుందని చెప్పారు.

### జైపాల్‌రెడ్డికి సీఎం రేవంత్ నివాళులు

కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత ఎస్. జైపాల్ రెడ్డి 5 వ వర్ధంతి సందర్భంగా నక్లెస్‌రోడ్ లోని స్ఫూర్తి స్థల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. జైపాల్ రెడ్డి తన జీవితాన్ని తెలంగాణ కోసం త్యాగం చేశారని కొనియాడారు. రాష్ట్ర ఏర్పాటులో జైపాల్ రెడ్డి పాత్ర మరవలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వారితో పాటు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## యువకుడి దారుణ హత్య

హైదరాబాద్, జూలై 28 (ప్రజాస్వరం) : రూమ్మేట్ పై కత్తితో దాడి చేసి హత్య చేసిన ఘటన ఎస్ ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్ గా పనిచేస్తున్న కర్నూల్ జిల్లా ఆలమూరు గ్రామ నివాసి వెంకటరమణ.. సెలూన్లో పనిచేసే గణేష్ ఒకే హాస్టల్ రూమ్ లో ఉంటున్నారు. గణేష్ రోజూ మద్యం సేవించి వచ్చి నిద్రకు ఆటంకం కలిగిస్తున్నందుకు ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన గణేష్ కటింగ్ షాప్ లో ఉపయోగించే కత్తితో వెంకటరమణపై విచక్షణారహితంగా దాడి చేశాడు. రక్తపు మడుగులో వెంకటరమణ అక్కడిక్కడే మృతి చెందారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్ ఆర్ నగర్ పోలీసులు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.